క్లుప్తంగా

శిల్పికి ఘన సత్కారం



శిల్పి కేతినీడి నాగరాజు చౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: సరస్వతీదేవి, హైమావతీదేవి విగ్రహాల శిల్పి సోమవరప్పాడుకు చెందిన కేతినీడి నాగరాజు చౌదరి నైపుణ్యత, ఓర్పు, అభినందనీయమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, వీరమాచినేని దాసు, మొటపర్తి రాజా అన్నారు. శుక్రవారం దెందులూరులో శిల్పిని గ్రామం, దాతల తరపున ఉన్నత పాఠశాల హెచ్ఎం పీ.రామశర్మ, ఉపాధ్యాయులు పల్లారెడ్డి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

విశ్వబ్రాహ్మణులపై సానుభూతి చూపాలి



విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహం అందించి సత్కరించిన దృశ్యం

ఉంగుటూరు: విశ్వబ్రాహ్మణులపై ప్రభుత్వాలు సానుభూతి చూపాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలబక్తుల శివకేశవరావు (శివశ్రీ) అన్నారు. శుక్రవారం నారాయణపురంలో విశ్వబ్రాహ్మణ కులానికి చెంది చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులైన వారిని ప్రోత్సహిస్తూ నగదు పురస్కారాలు అందజేశారు. సంఘం అధ్యక్షులు పట్నాల శంకరాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను చదువులో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, కటకం శ్రీనివాసాచారి పాల్గొన్నారు.


వైభవంగా పవిత్రోత్సవాలు



గుండుగొలనులో భక్తుల పూజలందుకుంటున్న సీతారామస్వామి

భీమడోలు: గుండుగొలనులో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన సీతారామస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఆలయంలో 50 ఏళ్లుగా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ఫౌండర్ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మూడవరోజైన శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అర్చకులు విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. వివిధ హోమాలు, కల్యాణమూర్తికి అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వసతిగృహ విద్యార్థినులకు 20 సైకిళ్ల బహూకరణ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

నిడమర్రు: పెదనింద్రకొలను గ్రామ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆ గ్రామ బాలికల వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలకు బాలికల వసతి గృహానికి 2 కిలోమీటర్లుపైగా దూరం ఉండటంతో వసతిగృహం నుంచి జెడ్పీస్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి సోమేశ్వరరావు, మాధవరపురాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, మండల పరిషత్ ఉపాధ్యాయులు బండి రమణ, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, హెచ్ఎం టీవీ సత్యనారాయణ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన

దెందులూరు: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుప్రీంకోర్టు పునరాలోచించాలని మాలమహానేన దెందులూరు మండల అధ్యక్షుడు నిట్టా శ్రీను అన్నారు. శుక్రవారం జోగన్నపాలెంలో మాలమహానేన, పల్లాయిగూడెం అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిట్టా శ్రీను మాట్లాడుతూ ఈ నెల 17న చలో ఏలూరు కార్యక్రమాన్ని పాల్గొని మాల జాతి ఔన్నత్యాన్ని, ఐక్యతను దేశానికి చాటాలన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తొలగించడం కూటమి ప్రభుత్వం చేసిన పెద్ద తప్పు అన్నారు. అంబేడ్కర్ విగ్రహం జోలికి వస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఆయన హెచ్చరించారు.

బిల్లు చెల్లింపునకు క్యూఆర్ కోడ్

- థర్డ్‌పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ చెల్లింపులు నిలిపివేత
- ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించే అవకాశం
- భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో 60వేల విద్యుత్ కనెక్షన్లు



భీమడోలులోని ప్రధాన విద్యుత్ స్టేషన్



విద్యుత్ సంస్థకు చెందిన వెబ్‌సైట్‌లో పొందుపర్చిన సమాచారం

భీమడోలు: విద్యుత్ వినియోగదారుల నెలవారీ బిల్లుల చెల్లింపులో ఈపీడీసీఎల్ క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. బిల్లుపై ముద్రించిన క్యూ ఆర్ కోడ్‌తో సెకన్లలో ఇట్టే విద్యుత్ బిల్లును చెల్లించవచ్చు. విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ సంస్థ ఈ విధానాన్ని ఈ నెల నుంచి అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులు జరుగుతుండగా, రిజర్వ్‌బ్యాంకు ఆదేశాలతో జూలై నెల నుంచి బిల్లుల చెల్లింపులో మార్పులు చేపట్టారు. సంస్థ గతంలో థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే విధానానికి ఆర్‌బీకే చెక్ పెట్టింది. కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా కంపెనీ యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులను చెల్లించేలా నిబంధనలను కఠినతరం చేసింది. విద్యుత్ సంస్థ ఉన్నతాధికారులు తయారీ చేసిన క్యూఆర్ కోడ్‌తో కూడా బిల్లులు చెల్లించుకునే వెసులుబాటును ఇచ్చింది. ఇప్పటి వరకు గడువు దాటిన తర్వాత కూడా యాప్‌ల్లో వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించడంతో ఇకపై అలాంటి వాటికి చెక్ పెట్టేసింది.

ఇప్పటి వరకు ఇలా

గతం వరకు విద్యుత్ వినియోగదారుల్లో కొంతమంది బిల్లులకు విద్యుత్ కార్యాలయాల్లో రెవెన్యూ కౌంటర్ల వద్ద, మరికొందరు మీ సేవా, సచివాలయాలు, పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా చెల్లించేవారు. అత్యధిక వినియోగదారుల మాత్రం గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, ఇతర యాప్‌లను వినియోగించడం పరిపాటి. కొన్ని సందర్భాల్లో ఈ యాప్‌ల ద్వారా చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం టుంది. ఇకపై ఇలాగు చేయడం కుదరదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ మేమెంట్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

స్పష్టమైన ఆదేశాలు

ఆర్‌బీఐ మార్గదర్శకాలు మేరకు చెల్లింపు విధానంలో మార్పు చోటు చేసుకున్నాయని సంస్థ తెలిపింది. ఇక మీదుట ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యాప్‌ల యాప్స్ ద్వారా బిల్లుల చెల్లించేటప్పుడు ఈపీడీసీఎల్ పేరు కనిపించదు. విద్యుత్ వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడు చేసుకోవాలి లేదా సంస్థ వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. సంస్థ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించే తరుణంలో వినియోగదారులు గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎంపే ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డిబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డులను కూడా వినియోగించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని సూరప్పగూడెం, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, ద్వారకాతిరుమల, ఎం.నాగులపల్లి సబ్‌స్టేషన్‌పరిధిలో 60వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కొత్త విధానం అమలులోకి వచ్చినా విద్యుత్ వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో పాత విధానంలో యాప్‌ల్లో విద్యుత్ బిల్లులు చెల్లించి నష్టపోయిన విద్యుత్ వినియోగదారులు గగ్గోలుపెడుతున్నారు.

యాప్‌లోనే సమస్త సమాచారం

సమస్త సమాచారం యాప్‌లోనే ఈ యాప్‌లో పేమెంట్ హిస్టరీలో ప్రతి నెలా చెల్లించిన బిల్లుల వివరాలు చూసుకోవచ్చు. వాటితో పాటు ఎన్ని యూనిట్లు వినియోగించాం. కరెంట్ బిల్లు ఎంత, ఇతర ఛార్జీల వివరాలతో కలిసి మొత్తం బిల్లు ఎంత, అనే వివరాలు తెలుసుకోవచ్చు, ఇంటిలో వాడే విద్యుత్ పరికరాలు ఎంత సమయం వాడితే ఎన్ని యూనిట్లు కావాల్సి వస్తుందనే వివరాలు తెలుసుకోవచ్చు. మన సర్వీస్ ఏ ఫీడర్, ఏ సబ్‌స్టేషన్ పరిధిలో ఉంది. ఏఈ, ఏడీఈ నంబర్ల అందుబాటులో ఉన్నాయి. వాటితో పాటు ఫిర్యాదులు చేసుకునేందుకు సౌలభ్యం ఉంటుంది. అద్దె ఇంటిలో ఉండే వారు నెల మధ్యలో ఇల్లు ఖాళీ చేసినప్పుడు ఇప్పటి వరకు విద్యుత్ వాడకం తెలుసుకునే అవకాశం ఉంటుంది.

వినియోగదారులకు మెరుగైన సేవలు



విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం. థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నందున ఆర్‌బీకే ఆదేశాలతో బిల్లుల చెల్లింపులో కొత్త విధానం అమల్లోకి వచ్చింది. ఇకపై సంస్థ యాప్‌లో గాని వెబ్‌సైట్‌లో మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలి. భీమడోలులో ఏడీఈ పరిధిలో గృహాలు, రైతులకు చెందిన, వివిధ సంస్థలకు చెందిన 60వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారులు కొత్త విధానంలో గడువులోగా బిల్లులు చెల్లించాలి.

– కె.గోపాలకృష్ణ, ఏడీఈ, భీమడోలు

వైభవంగా వరలక్ష్మీ వత్రం



గణపవరం మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

గణపవరం: మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే వరలక్ష్మీవ్రతం పర్వదినాన్ని శుక్రవారం మహిళలు వైభవంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణలుచేసి, వివిధ రకాల వంటకాలు, పూలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి, వరలక్ష్మీదేవికి పూజలు చేశారు. తోటి మహిళలను పేరంటంగా పిలిచి వాయినాలు ఇచ్చి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపవరంలోని కనకదుర్గ ఆలయం, ధనలక్ష్మిదేవి ఆలయాల్లో మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. గణపవరంలోని దండు మారెమ్మ అమ్మవారిని మారెమ్మ యూత్ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో పూజలు

దెందులూరు: గాలాయగూడెంలో ప్రసిద్ధి గాంచిన అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలను ఎమ్మెల్యే సతీమణి రాధమ్మ భక్తులతో కలిసి నిర్వహించారు. అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆమె సారె సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు అమ్మవారి జ్ఞాపిక ఇచ్చి శాలువాతో సత్కరించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత



దెందులూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ బీ.సుమతి

దెందులూరు: గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత ఆదేశించారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ ఏ శాఖలోనైనా మండలాధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులు వారి పరిధిలో పని సక్రమంగా చేయకపోతే తద్వారా వచ్చే చెడ్డ పేరు, అన్ని శాఖల అధికారులు భరించాల్సి ఉంటుందని అన్నారు. బాధ్యతగా గ్రామస్థాయి ఉద్యోగులు వారి పరిధిలో పనులు పూర్తి చేయాలన్నారు. దెందులూరు బస్టాండ్ సెంటర్, లైబ్రరీ సెంటర్, ఉన్నత పాఠశాలతో ఇతర ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడం, నెలలు తరబడి అక్కడ ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అన్ని గ్రామాల ప్రజలు భూసమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని అన్నారు. ఎంఈఓ ఏవీఎస్వీ ప్రసాద్, ఇతర మండల అధికారులు శాఖల వారీగా వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ భీమరాజు, మండలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

దెందులూరు: దెందులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు తాను ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు అందిస్తానని విద్యా సంస్థల అధినేత మొటపర్తి రాజా అన్నారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయుల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన వాటర్ బాటిళ్లను ఆయన పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పీ.రామశర్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ సక్రమంగా విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నూరు శాతం ఫలితాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తులసీదాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కొడాలి ఆంజనేయచౌదరి, సుగ్గిశెట్టి నూకరాజు, దేవినేని తులసీదాస్ ఉన్నారు.

కరాటే శిక్షణతో ఆత్మ రక్షణకు భరోసా



భీమడోలులో సాధించిన బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు అందుకున్న కరాటే విజేతలు

భీమడోలు: కరాటే శిక్షణతో ఆత్మ రక్షణకు భరోసా లభిస్తుందని భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు అన్నారు. భీమడోలు మాంటిస్సోరి విద్యా సంస్థల కార్యాలయంలో శుక్రవారం జపాన్ షోటోకాన్ కరాటే-డు- కన్నిన్‌జా ఆర్గనైజేషన్(ఇండియా) ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఏపీ ఛీప్ షిహాన్ డీఎల్ నారాయణ, భీమడోలు కరాటే మాస్టర్ ఎం.సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. చిన్నారులు చక్కని ప్రతిభను చాటి ఎల్లో బెల్ట్, బ్లూ బెల్ట్, పర్పుల్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈకార్యక్రమానికి ఇన్‌చార్జి పి.బాలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, ఉంగుటూరు నియోజకవర్గ కోకన్వీనర్ వెజ్జు ధార్మరావు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.కృష్ణకుమారి, పి.వీర రాఘవులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిషప్ జాన్ ములగడ సేవలు ఆదర్శనీయం



దివంగత బిషప్ జాన్ ములగడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఫాదర్ బాల తదితరులు

దెందులూరు: కోస్తా జిల్లాల్లో ఆదర్శవంతమైన ఆధ్మాతిక సేవలను ఆర్‌సీఎం ఏలూరు పీఠం తొలి బిషప్ జాన్ ములగడ అందించారని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. శుక్రవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ విద్యా సంస్థల్లో బిషప్ జాన్ ములగడ 15వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత వికార్ ఫోరెన్ విం‌జేపాల్ , వికార్ జనరల్ బాల తదితరులు జాన్ ములగాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిషప్ జాన్ ములగడ కోస్తా జిల్లాల్లో ఆధ్యాత్మిక సేవను, సువార్త ప్రకటనను క్షేత్రస్థాయిలో అందివ్వడం, విద్యా, వైద్య, మౌలికవసతుల కల్పన, ప్రాథమిక నిర్మూలన, యువత, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ, గృహనిర్మాణంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, భారత ప్రధాని సైతం ప్రశంసించిన సంగతి విదితమే. ఆధ్యాత్మిక రంగంలో బిషప్ జాన్ ములగడ సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సాల్మన్‌రాజు, జోజిబాబు, సుందరి, అన్నారావు, రాజ్‌కుమార్, ప్రసాద్, రమణ ఉన్నారు.

వర్గీకరణ తీర్పుపై పునరాలోచించాలి

భీమడోలు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పునరాలోచన చేయాలని కోరుతూ మాల పోరాట యోధుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరులో ఈనెల 17వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు తలపెట్టిన మాలల భారీ ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్ శుక్రవారం రాత్రి కోరారు. ఈ ర్యాలీలో పార్టీలకుతీతంగా మాలలంతా భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ ఉదయం 10 గంటలకు ఏలూరు పాత బస్టాండ్ వద్ద గల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయం వద్ద వరకు సాగుతుందన్నారు.

సామాజిక కార్యకర్త రాజుకి సత్కారం



రాజును సత్కరిస్తున్న జిల్లా యాదవ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉత్తమ సోషల్ సర్వీస్ సేవా రత్న అవార్డును అందుకున్న సామాజిక కార్యకర్త మల్లిపూడి రాజును జిల్లా యాదవ సంఘం నాయకులు అభినందించారు. స్థానిక ఏటిగట్టులో ఉన్న జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం, మంచి కోరే స్వభావం, సమాజం జంతువుల పట్ల బాధ్యతగా భావించే గుణం వంటి కారణాలతో మల్లిపూడి రాజు ఆగస్టు 15న ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి చేతులు మీదుగా అవార్డును అందుకోవడం అభినందనీయమని అన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మెరుగుమాల శ్రీనివాసరావు, కిలారపు జగదీష్, కొమ్మ నాగరాజు, చిదరబోయి శ్రీనివాస్, ఉక్కుసూరి గోపాలకృష్ణ, బొట్టా అజయ్, డొక్కు మల్లేశ్వరరావు, మేకల శ్రీరామ్ మూర్తి, కొల్లిపర నాగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి



భీమడోలులో నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ పారామెడికల్స్ వైద్యులు

భీమడోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుతావలు మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకుని రావాలని లేకుంటే ఉద్యమిస్తామని భీమడోలు కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీర్మానించింది. భీమడోలులోని అమ్మవార్ల ఆలయంలో శుక్రవారం పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లో ఓ యువ మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి చేసి కొందరు దుండగులు దారుణంగా పైశాచికానందం పొంది ఘెరంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది నిమిషాల పాటు మౌనం పాటించారు. ప్రభుత్వం బాధ్యులైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కన్వీనర్ రంజాన్ వల్లి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎం.జయరామ్ మాట్లాడుతూ వైద్యురాలికి ఆసుపత్రిలోనే రక్షణ లేకపోవడం దారుణమని అన్నారు. ఇలాంటి ఘటనల ద్వారా డాక్టర్లు తమ సేవలను నిలిపివేస్తే ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోతాయన్నారు. రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా ఈనెల 17న నల్లబ్యాడ్జీలను ధరించి ఫస్ట్ ఎయిడ్ సేవలను నిలిపివేస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ ఎం.పల్లారావు, మండల సభ్యులు పాల్గొన్నారు.

ట్రైనీ డాక్టర్‌ను హత్యచేసిన వారిని శిక్షించాలి

గణపవరం: ఆర్‌జీ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన పౌర వలంటీర్‌ను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా నిందితులకు ఉరి శిక్ష వేయాలని గణపవరం పీఎంపీ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్‌మూర్తి మాట్లాడుతూ ట్రైనీ వైద్యురాలు పనిచేసే మెడికల్ కాలేజీకి నిందితుడికి ఎలాంటి సంబంధంలేకపోయినా తరచూ మెడికల్ కాలేజీకి ఎందుకు వెళ్తున్నాడో విచారించాలని కోరారు. ఐఎమ్ఏ ఆందోళనకు తమ సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

సిమెంట్ ఏజెన్సీ పేరుతో మోసం

దెందులూరు: సిమెంట్ కంపెనీ ఏజెన్సీ ఇప్పిస్తానని రెండు విడతలుగా రూ.లక్షా 72 వేలు నగదు తీసుకుని కడపకు చెందిన వుండేళ్ళ కిరణ్‌కుమార్ రెడ్డి మోసం చేశాడని మద్దా భూషణం అనే వ్యక్తి శుక్రవారం దెందులూరు పోలీసులను ఆశ్రయించాడు. రామారావుగూడెంలో తనకు సిమెంట్ కంపెనీ ఏజెన్సీ ఇప్పిస్తానని, మధ్యవర్తి ద్వారా పరిచయమై కిరణ్‌కుమార్‌రెడ్డి నేరుగా, ఫోన్ పే ద్వారా రెండు విడతలుగా రూ.లక్షా 72 వేలు తీసుకున్నాడన్నారు. తీసుకున్న తరువాత మధ్యవర్తి, డబ్బులు తీసుకున్న వ్యక్తి, ఏజెన్సీకి సంబంధించి ఎవరూ మాట్లాడటం లేదని విలేకరుల వద్ద వాపోయాడు. భూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.స్వామి తెలిపారు.

పోలీస్ కో-ఆపరేటివ్ భవనం ప్రారంభం

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోలీస్ కోఆపరేటివ్ సొసైటీని 1923లో ఏలూరు జిల్లా పోలీస్ కేంద్రంలో ఏర్పాటు చేశారు. నేడు ఏలూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్ ప్రాంగణంలో నిర్వహించిన సొసైటీ నూతన భవనాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.28 లక్షల వ్యయంతో పోలీస్ సిబ్బందికి ఉపయోగపడేలా భవనాన్ని నిర్మించటం అభినందనీయమని ఆయన తెలిపారు. పోలీస్ సొసైటీలోని సభ్యులందరికీ క్రమపద్ధతిలో రుణాలను మంజూరు చేస్తూ వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.స్వరూప రాణి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏపీ పోలీస్ హౌసింగ్ బోర్డు డిప్యూటీ ఈఈ షేక్ అబ్దుల్ ఖాదిర్, ఏలూరు డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బద్దా వెంకట్రావు

ఏలూరు (టూటౌన్): రైల్వే గూడ్స్‌షెడ్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏలూరు రైల్వే గూడ్స్ షెడ్ ఆవరణలో భవిశెట్టి కేశవ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వెంకట్రావు మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ, హమాలీల ఉపాధి భద్రతతో కూడిన చట్టం వచ్చేవరకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అసంఘటిత కార్మిక రంగానికి పని భద్రత కల్పించే విధంగా బీమా భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణకార్మిక సంఘం నగర అధ్యక్షుడు కాకర్ల శ్రీనివాసరావు,గూడ్స్‌షెడ్ హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

తల్లాపురంలో అంగన్‌వాడీ భవనం ప్రారంభం



తల్లాపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: తల్లాపురంలో రూ.9.50 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం ప్రారంభించారు. సర్పంచి పసుపులేటి నర్సింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో ధర్మరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు.

ఫ్రైడే డ్రై డే ర్యాలీలు

ఏలూరు రూరల్ : వర్షాకాలంలో మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జి.గోవిందరావు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక పీహెచ్‌సీ అధికారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గుడివాకలంక, మానూరు, మహేశ్వరపురం తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉంటే దోమల వ్యాప్తి చెంది అనారోగ్యపాలవుతామని వివరించారు.